సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 5 । అక్టోబర్ । 2022

మంచు దుప్పటిలో మన్యం



పెదబయలు: మన్యంలో పలు ప్రాంతాల్లో మంచు విపరీతంగా కురుస్తోంది. రెండు రోజుల నుంచి మంచుపడుతోంది. పెదబయలులో మంగళవారం ఉదయం 9.30 గంటల వరకు దట్టంగా మంచు పడింది. మంచుతో పాటుగా తేలిక పాటి వర్షం కురువడంతో వాతావరణం చల్లగా మారింది. ప్రతీ రోజూ పెదబయలు మండల కేంద్రానికి ఉదయం కూరగాయలు, ఇతర పంటలు అమ్మకానికి తీసుకువచ్చే గిరిజనులు దట్టంగా కురుస్తున్న మంచులో వస్తున్నారు. పొగమంచు ఎక్కువగా ఉండడం వల్ల వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. లైట్లు వేసుకుని వాహనాలను నడుపుతున్నారు.

రూ.5 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- నలుగురు స్మగ్లర్లు అరెస్టు
- కారు సీజ్

IIలో



న్యూస్‌రీల్

కలెక్టర్ చొరవతో వృద్ధురాలికి పింఛన్



వృద్ధురాలు మహాలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ రామారావు

సాక్షి,పాడేరు: కలెక్టర్ చొరవతో వీఆర్ పురం మండలం చింతరేవుపల్లి గ్రామానికి చెందిన మహాలక్ష్మి అనే వృద్ధురాలికి పింఛన్ పునరుద్ధరించారు. ఐరిస్, వేలి ముద్రలు పడకపోవడంతో ఆమెకు పది నెలలుగా పింఛన్ అందడం లేదు. సచివాలయ ఉద్యోగులు కూడా నిస్సహాయత వ్యక్తం చేశారు. దీంతో ఆమె ఈ విషయాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ చొరవ తీసుకుని 24 గంటల్లో పింఛన్ పునరుద్ధరించారు. వృద్ధాప్యం కారణంగా వేలి ముద్రలు, ఐరిస్ పడకపోయినప్పటికీ విజయవాడలోని సాంకేతిక సిబ్బందితో సంప్రదించి మాన్యువల్‌గా సవరించి పింఛన్ అందజేశారు. ఈ నెల నుంచి యథావిధిగా పింఛన్ అందజేస్తున్నామని, జనవరి 2023 నుంచి పెంచిన పింఛన్ కూడా అమలు చేస్తామని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళి తెలిపారు. ఈనెలకు సంబంధించిన పింఛన్ సొమ్మును మంగళవారం సర్పంచ్ పిట్టా రామారావు అందజేశారు.

పర్యాటక ప్రాంతాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు

జేసీ శివ శ్రీనివాస్



గిరిజన మ్యూజియం వద్ద జేసీ శివశ్రీనివాస్

అరకులోయ రూరల్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వద్ద ప్రభుత్వం పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించిందని జేసీ శివశ్రీనివాస్ తెలిపారు. అరకులోయ మండల కేంద్రంలోని గిరిజన మ్యూజియం,పద్మాపురం గార్డెన్‌లను ఆయన మంగళవారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భవిష్యత్‌లో పర్యాటక ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహల్దార్ దొన్ను,వీఆర్వోలు కోటి,కృప తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు తాజా ఆహారం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఆశ్రమ పాఠశాలలకు ఎప్పటికప్పుడు తాజా కూరగాయలు సరఫరా చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశించారు. ఐటీడీఏ సమావేశం హాలులో మంగళవారం డీడీ సీహెచ్ శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో 83 ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలున్నాయని, ప్రతీ రోజూ విద్యార్థులకు తాజాగా ఆహార పదార్థాలు తయారు చేసి, అందజేయాలని తెలిపారు. పాలు,గుడ్లు,చికెన్, అరటిపండ్లను సకాలంలో హాస్టళ్లకు సరఫరా చేయాలన్నారు. వీటి సరఫరాకు మూడు నెలలకు ఒకసారి టెండర్లు పిలవనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు టెండర్లు ఖరారు చేసినట్టు తెలిపారు. ఏడు మండలాల్లోని ఆశ్రమ పాఠశాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు వారానికి రెండు రోజుల పాటు ఆది, మంగళవారాల్లో కోడి మాంసం పెట్టాలని తెలిపారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీకి తరలించి, సకాలంలో వైద్యసేవలందించాలని తెలిపారు. అధికారుల అనుమతి లేకుండా బయటవ్యక్తులను ఆశ్రమ పాఠశాలల్లోకి అనుమతించవద్దని ఆదేశించారు.

అటవీశాఖలో పెను మార్పులు

- జిల్లాలో కొత్తగా నాలుగు ఫారెస్టు డివిజన్ల ఏర్పాటు
- రంపచోడవరంలో వైల్డ్‌లైఫ్ రేంజ్ కార్యాలయం
- రెండు జిల్లాల పరిధిలోకి నేషనల్ పార్కు

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో అటవీశాఖలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. జిల్లాలో కొత్తగా పాడేరు, రంపచోడవరం, చింతూరు, చింతపల్లి అటవీ డివిజన్లు ఏర్పాటవడంతో పాటు చింతూరు లాగింగ్ డివిజన్‌ను రద్దు చేశారు. పాపికొండల నేషనల్ పార్కును ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల సంయుక్త పరిధిలోకి తెచ్చారు. రంపచోడవరంలో కొత్తగా వైల్డ్‌లైఫ్ రేంజ్ కార్యాలయం ఏర్పాటువుతోంది.

రంపచోడవరం: రాష్ట్రంలోనే అతి పెద్ద అటవీ ప్రాంతం ఉన్న జిల్లాగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఆవిర్భవించింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు అనేక ప్రభుత్వశాఖలను పునర్విభజించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కొత్తగా పాడేరు, రంపచోడవరం, చింతూరు, చింతపల్లి అటవీ డివిజన్లు ఏర్పాటయ్యాయి. రంపచోడవరం డివిజన్‌లో ఎనిమిది రేంజ్ ఆఫీసులు ఉన్నాయి. వీటిలో ఆరు టెరిటోరియల్ కాగా, ఒక లాగింగ్, మరొకటి వైల్డ్ లైఫ్ రేంజ్. రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, ఇందుకూరు, రాజవొమ్మంగి, పోక్సుపేట రేంజ్‌లను కొతగా ఏర్పాటు చేశారు. 1970 నుంచి 2005 సంవత్సరం వరకు కొనసాగిన మారేడుమిల్లి రేంజ్‌ను మళ్లీ పునరుద్ధరించారు.పాపికొండలు నేషనల్ పార్క్ కూడా రంపచోడవరం డివిజన్ పరిధిలోకి వచ్చింది.

ఐదు లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ...

జిల్లాలో నాలుగు ఫారెస్టు డివిజన్లలో సుమారు 5 లక్షల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. రంపచోడవరం డివిజన్‌లో 2,63,869 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. రంపచోడవరం రేంజ్‌లో 54,532.89 హెక్టార్లు, మారేడుమిల్లిలో 69,114.20 హెక్టార్లు, అడ్డతీగలలో 44,090.69 హెక్టార్లు, ఇందుకూరు 26,538.13 హెక్టార్లు, పోక్సుపేట 33,789.56 హెక్టార్లల్లో అటవీ ప్రాంతం ఉంది. రంపచోడవరం డివిజన్‌లో మారేడుమిల్లి రేంజ్‌లో ఎక్కువ అటవీ ప్రాంతం ఉంది. చింతూరులోని లాగింగ్ (కలప డిపో)ను రద్దు చేసి అడ్డతీగలలో కొనసాగిస్తున్నారు.



పాపికొండలు

రంపచోడవరంలో వైల్డ్‌లైఫ్ రేంజ్ కార్యాలయం

రంపచోడవరం డివిజన్‌లో కొత్తగా వైల్డ్‌లైఫ్ కార్యాలయం ఏర్పాటువుతోంది. ఇకపై ఏలూరు జిల్లాతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారులు సంయుక్తంగా వైల్డ్‌లైఫ్ కార్యకలాపాలు నిర్వహిస్తారు. డివిజన్ పరిధిలో అటవీ ప్రాంతంలో అంతరించిపోతున్న అరుదైన జాతుల మొక్కల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణకు రేంజ్‌లో కృషి జరుగుతోంది. సహజ పునరుత్పత్తిలో భాగంగా స్థానిక జాతులతో పాటు అంతరించిపోతున్న రోజ్‌వుడ్ వంటి మొక్కలను అభివృద్ధి చేస్తున్నారు. 56 హెక్టార్లలో మొక్కలు నాటారు. నేలలో తేమ పెంచేందుకు కొండల చుట్టూ కందకాలు తవ్వుతున్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనుల సాగులో ఉన్న పోడులకు పట్టాలు ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ పాటు అటవీ అధికారులు పనిచేశారు. అటవీ సంరక్షణలో భాగంగా అటవీశాఖ ఉన్నతాధికారులు బేస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ బేస్‌క్యాంపుల్లో 24 గంటలూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అటవీ ప్రాంతం నుంచి ఎటువంటి కలప, వన్యప్రాణులు తరలిపోకుండా చర్యలుతీసుకుంటున్నారు. డివిజన్ పరిధిలో పది వరకు బేస్‌క్యాంపులు ఉన్నాయి.



రంపచోడవరం డీఎఫ్‌వో కార్యాలయం

అటవీ సంరక్షణకు గిరిజనులతో కలిసి పనిచేస్తాం



కొత్త ఫారెస్టు డివిజన్ ఏర్పాటుతో బాధ్యతలు స్వీకరించిన డీఎఫ్‌వో నరేంధిరన్ 'సాక్షి'తో మాట్లాడుతూ చేపట్టబోతున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. అటవీ సంరక్షణకు స్థానిక గిరిజనులతో కలిసి పనిచేస్తామన్నారు. ఏజెన్సీ ఏరియాలో అటవీ హక్కుల చట్టం ద్వారా వేలాది ఎకరాల పోడు భూములకు గిరిజన రైతులు హక్కులు పొందారని తెలిపారు. ఆయా భూముల ద్వారా గిరిజనుల ఆదాయం పెరిగేలా సహకారం అందిస్తామన్నారు. గిరిజనుల సొంత భూముల్లో ఆదాయం ఇచ్చే కలప ఉంటే రెవెన్యూ శాఖతో పాటు అటవీ అధికారులకు సమాచారం ఇస్తే వాటిని తరలించుకునేందుకు అనుమతులు ఇస్తామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు ఐటీడీఏ పీవోతో కలిసి యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నామని తెలిపారు. గుడిసె పర్యాటక ప్రాంతానికి సంబంధించి శుక్రవారం ఐటీడీఏ పీవోతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. గుడిసె కొండల్లో గ్రాస్ (గడ్డి)ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన ఐదు రోడ్లకు సంబంధించిన అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్టు చెప్పారు. రాష్ట్రంలోనే ఉన్న ఏకైక నేషనల్ పార్కు ఏలూరు, అల్లూరి జిల్లాల పరిధిలో విస్తరించి ఉందని, ఈ పార్కులో చేపట్టాల్సిన చర్యలపై ముగ్గురు డీఎఫ్‌వోలతో నవంబరు 1న రాజమహేంద్రవరంలో సమావేశం ఉందని చెప్పారు. కొత్త యాక్షన్ ప్లాన్, సఫారీ, నేషనల్ పార్కులోకి పర్యాటకులు వెళ్లేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని నరేంధిరన్ వివరించారు.

• జయజయహే మహిషాసుర మర్దని..



శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదవ రోజు మంగళవారం దుర్గమ్మ మహిషాసుర మర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజయదశమి వేడుకలకు పలు ఆలయాలను ముస్తాబు చేశారు. వేకువజామునుంచే దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు. జిల్లాలో భవానీ మాల ధరించిన పలువురు భక్తులు ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు.

విజయాలు చేకూరాలి

దసరా శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

సాక్షి,పాడేరు: జిల్లాలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, చేపట్టే పనులన్నింటిలో విజయాలు చేకూరాలని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. విజయదశమిని పురస్కరించుకుని కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రికార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాసంక్షేమ పాలనకు దేశవ్యాప్త ప్రశంసలు

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: రాష్ట్రంలో సాగుతున్న ప్రజాసంక్షేమ పాలనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టులో మంగళవారం ఆమె పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం మహాశక్తి రూపిణి దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి, 25 ఏళ్లపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న వైఎస్ జగన్ పక్షాన రాష్ట్ర ప్రజలంతా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోలాపుట్టు సర్పంచ్ నీలకంఠం, సుజనకోట ఎంపీటీసీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జోలాపుట్టులో దుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

మ్యుటేషన్ వేగవంతం

కలెక్టర్ సుమిత్ కుమార్



కించుమండ గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

డుంబ్రిగుడ: మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మండలంలోని కించుమండ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పంచాయతీ పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో మ్యుటేషన్ త్వరితగతిన నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని, బిల్లులు సకాలంలో అందేలా చూడాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న సరకులను పరిశీలించడంతో పాటు ఏఎన్‌ఎం,అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న వారికి తగిన పోషకాహారం, మందులు ఇవ్వాలని తెలిపారు. సామాజిక పింఛన్ మంజూరు, పంపిణీలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

ఘనంగా ముగిసిన బతుకమ్మ ఉత్సవాలు



టేకులబోరులో నిమజ్జనానికి ముందు బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అమీనాబాద్ కాలనీలో బోనాలతో దుర్గమ్మ గుడికి వెళుతున్న భక్తులు

వీఆర్‌పురం/రాజవొమ్మంగి: పలు గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. వీఆర్‌పురం మండలం రేఖపల్లి కోటమైసమ్మ ఆలయ, వీఆర్‌పురం పెట్టవీధి, కూనవరం మండలంలో టేకులబోరు,కూనవరం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బతకమ్మలను సోమవారంరాత్రి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఆదివారం ప్రారంభమైన ఈ ఉత్సవాలను తొమ్మిదిరోజుల పాటు వైభవంగా నిర్వహించారు. తొలిరోజు ఎంగిలిపూలతో బతకమ్మ పండగ ప్రారంభమైంది. నిమజ్జనోత్సవం సందర్భంగా పలు గ్రామాల్లో సందడి వాతావరణ నెలకొంది. టేకులబోరు దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద నిర్వాహకులు మంగళవారం అన్నదానం చేశారు. రాజవొమ్మంగి మండలం అమీనాబాద్‌కాలనీలో మంగళవారం బోనాల పండగను వైభవంగా జరిపారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, నైవేద్యాలు, నూతన వస్త్రాలు, పసుపుకుంకుమలు సమర్పించారు.

ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలి

చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

కూనవరం: ఏజెన్సీలోని నిరుద్యోగ యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. కూనవరం, వీఆర్‌పురం పోలీసు స్టేషన్ల పరిధిలోని నిరుద్యోగ యువతకు స్థానిక బస్టాండు సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత పొందిన నిరుద్యోగులు ఈనెల 10న నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరై టాటా టెక్నాలజీస్ కంపెనీలో ఉద్యోగావకాశాన్ని పొందాలన్నారు. నెలకు రూ.17వేల వేతనం చెల్లిస్తారని, ఉచిత వసతి, భోజనం, రవాణా సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర కంపెనీల మాదిరిగా అగ్రిమెంట్ ఇవ్వాల్సిన పని ఉండదని, ఇష్టం లేనట్టయితే కొద్ది రోజులు తర్వాత తిరిగి రావొచ్చని భరోసా ఇచ్చారు. దూరాభారం, భాష సమస్య తదితర కారణాలతో బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని, అవకాశాన్ని చేజార్చుకోవద్దని ఆయన సూచించారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి ఏడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని, అనంతరం తమిళనాడులో హోసూర్ పట్టణంలో వీరికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన గిరిజన యువతులు వారికి సమీపంలోని పోలీసు స్టేషన్లలో సంప్రదించాలన్నారు. ఈ నెల 8న చింతపల్లిలో, 10న రంపచోడవరంలోను దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూనవరం, వీఆర్.పురం ఎస్‌ఐలు బి.వెంకటేష్, తెల్లం దుర్గా ప్రసాద్, స్థానిక ఎంపీటీసీ అనంతలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

గురి తప్పని చదువులకు.. ఏకలవ్య

- అత్యున్నత విద్యా ప్రమాణాలతో కొనసాగుతున్న పాఠశాలలు
- గిరిపుత్రుల భవితను తీర్చిదిద్దుతున్న విద్యాలయాలు


రాజవొమ్మంగిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఏకలవ్య పాఠశాల


తాళ్లపాలెం ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

రాజవొమ్మంగి: కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణతో అత్యున్నత విద్యా ప్రమాణాలతో మన్య ప్రాంతాల్లో కొనసాగుతున్న ఏకలవ్య విద్యాలయాలు (ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ /ఈఎంఆర్‌ఎస్) గిరిబిడ్డల భవితను నభూతో నభవిష్యతి అన్న రీతిలో తీర్చిదిద్దుతున్నాయి. ఏకలవ్య పాఠశాలల్లో ఇటీవల విడుదలైె పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత ఇందుకు సాక్షంగా నిలుస్తున్నాయి.

మోడల్‌గా.. మరింత మెరుగ్గా

ఏటా ఆరవ తరగతిలో 30 మంది బాలికలు, 30 మంది బాలురకు పాఠశాలల్లో ప్రవేశ అనుమతి లభిస్తుంది. 11వ తరగతిలో (ఇంటర్‌లో) ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 30 మంది చొప్పున ప్రవేశాలు కల్పిస్తారు.ఒక్కో పాఠశాలలో మొత్తం 480 మంది విద్యార్థులు అభ్యసిస్తారు. ఏటా ఒక్కో విద్యాలయం నుంచి 90 మంది ఇంటర్ పూర్తి చేస్తారు. ఉచిత విద్యతో పాటు సెంట్రల్ బోర్డ్ సిలబస్, కేంద్రియ విద్యా విధానాలను మించిన ప్రణాళిక. డిజిటల్, వర్చ్యువల్ విధానాల్లో ఇంగ్లిష్‌లో బోధన ఉంటుంది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, అధునాతన వసతి సదుపాయాలు, కార్పొరేట్ స్థాయికి మించిన విద్యా బోధన ఈ పాఠశాలల ప్రత్యేకత. విద్యార్థుల విద్య, ఆరోగ్యంతో పాటు యోగా, ధ్యానం వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పండగ వేళల్లో విద్యాలయాల్లో సంబరాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నింపుతున్నారు.నిష్ణాతులైన ఉపాధ్యాయులు, పాఠశాల క్యాంపస్‌లోనే ప్రాథమిక వైద్యం, పరిశుభ్రమైన తాగునీరు, అధునాతన మరుగుదొడ్లు, కాస్మోటిక్స్ అందజేత తదితర అనేక సదుపాయాలు ఈ ఏకలవ్య పాఠశాలల్లో ఉన్నాయి. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూపాయలకు పైగా ఖర్చుచేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 28 ఏకలవ్య పాఠశాలలు ఉండగా, ప్రస్తుతం 12 పాఠశాలలు 11వ తరగతి వరకు బోధన సాగుతోంది. గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇక్కడ అభ్యసించే విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ 1.2 లక్షలకు పైగా కేటాయిస్తోందని ఏపీ గురుకులం జాయింట్ సెక్రటరీ హేమలత రాణి 'సాక్షి'కి తెలిపారు. గిరిపుత్రుల సమగ్ర వికాసానికి ఏకలవ్య పాఠశాలలు బాటలు వేస్తున్నాయని చెప్పారు.

శారదా పీఠాన్ని సందర్శించిన అరకు ఎంపీ దంపతులు


స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులు తీసుకుంటున్న ఎంపీ దంపతులు

కొయ్యూరు: అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు మంగళవారం విశాఖలోని శారదా పీఠాన్ని సందర్శించారు. పీఠం వ్యవస్థాపకులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులు తీసుకున్నారు. దసరా పండగ నేపథ్యంలో శారదా పీఠాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా స్వామితో భేటీ అయ్యారు. అనంతరం రాజశ్యామల అమ్మవారికి వారు పూజలు చేశారు. పీఠం ప్రాంగణంలోని దేవతా మూర్తుల ఆలయాలను సందర్శించారు. అనంతరం ఎంపీ మాధవి విలేకరులతో మాట్లాడుతూ శారదా పీఠంకు వచ్చి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామిని కలవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలన్నారు.

శరీరంపై వేడి నీళ్లు పడి బాలుడికి గాయాలు


బాలుడికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

పెదబయలు: మండలంలోని సీతగుంట గ్రామానికి చెందిన లకే గగన్ సాయి అనే రెండేళ్ల బాలుడికి శరీరంపై వేడి నీరు పడి గాయాలయ్యాయి. సీతగుంట గ్రామానికి చెందిన లకే అనిల్‌కుమార్, కుమారి ఇరువురు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం బాత్ రూంలో వేడినీళ్లు స్నానానికని ఉంచారు. ఇంతలో వీరు ఇంటి బయట రాగానే బాత్ రూంలోకి వెళ్లిన గగన్ సాయి ఎక్కువ వేడిగా ఉన్న నీరు తీసుకుని ఒంటిపై పోసుకున్నాడు. దీంతో బాబు, ఛాతీ, కడుపు బాగాల్లో కాలింది. తల్లిదండ్రులు బాత్‌రూం వైపు పరుగులు తీశారు. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బాలుడిని తీసుకుని వచ్చారు. వైద్య సిబ్బంది వైద్యం అందించారు. అయితే తక్కువ భాగం కాలిందని ప్రమాదం లేదని తెలిపారు.

సారాపై మహిళలు తిరుగుబాటు చేయాలి

ఎస్ఈబీ సీఐ గణపతిబాబు


పులుపును ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ పోలీస్ సిబ్బంది

అనంతగిరి: గ్రామాల్లో సారా, మద్యం అమ్మకాలపై మహిళలు తిరుగుబాటు చేయాలని, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గణపతి బాబు అన్నారు. మండలంలోని చిలకలగెడ్డ గ్రామ సమీపంలోని సారా బట్టీలపై దాడులు జరిపి 600 లీటర్ల పులుపును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని, ఎందరో మద్యానికి బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎస్ఈబీ ఎస్ఐ దాస్, ఎస్ఐ రామారావు దాడుల్లో పాల్గొన్నారు.

రూ.5 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- నలుగురు స్మగ్లర్లు అరెస్టు
- కారు సీజ్


పట్టుబడ్డ గంజాయి, నిందితులతో అనంతగిరి ఎస్ఐ రాము, పోలీసులు

అనంతగిరి: మండలంలోని డముకు జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. నలుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కారు, బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ కరక రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్ఐ కరక రాము ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ఉదయం డముకు వ్యూ పాయింట్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా అరకు నుంచి ఎస్.కోటకు వస్తున్న హోండా సిటీ కారును ఆపి తనిఖీ చేయగా, గంజాయి బస్తాలు గుర్తించారు. దీంతో కారులో ఉన్న ఇద్దరిని, వారి వెనుక బైకుతో పైలెట్‌గా వస్తున్న మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి బస్తాలను, కారును సీజ్ చేసి అనంతగిరి పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి 250 కిలోలు ఉందని, దీని విలువ రూ. 5 లక్షలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన వారిని ఢిల్లీలోని వజీరాబాద్‌కు చెందిన అశ్రార్, అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం జమిగూడ గ్రామానికి చెందిన వంతాల సోన్ను, వంతాల కృష్ణరావు, వంతాల చంద్రులుగా గుర్తించామని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రాము తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాజంనాయుడు, హెచ్‌సి కిరణ్‌కుమార్, పోలీసులు రాజేంద్ర,కృష్ణమూర్తి, ఏపీఎస్పీ పోలీసులు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి



జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సందడి చేశారు. విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించడంతో రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులతో టూరిస్టు బస్సులు, కార్లు, జీపుల్లో వచ్చి జలపాతాన్ని సందర్శించారు. వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు. రోజంతా సందర్శకులు ఉల్లాసంగా...ఉత్సాహంగా గడిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన గొర్రెలను చూపుతున్న రైతు నరేష్

వీఆర్‌పురం: విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని రేఖపల్లి గొల్లగుడెంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు మోడెం నరేష్ తెలిపిన వివరాలివి. నరేష్ తన ఇంటి వెనుక గొర్రెల షెడ్‌లో రోజు మాదిరిగానే తన గొర్రెల మందను సోమవారం రాత్రి ఉంచాడు. ఇంటికి సమీపంలోని వృక్షానికి విద్యుత్ తీగలు తగిలి కొద్దిమొత్తంలో మంటలు వచ్చాయి. అంతేకాకుండా ఇంటి వెనుక ఉన్న షెడ్డుకు విద్యుదాఘాతం సంభవించింది. దీంతో షెడ్డు గల గొర్రెలన్నీ చెల్లాచెదురయ్యాయి. ఈ ఘటనలో రెండు గొర్రెలు మృతి చెందగా మరో గొర్రె ప్రాణాపాయ పరిస్థితిలో ఉందని నరేష్ తెలిపారు. వెటర్నరీ, విద్యుత్ శాఖాధికారులు సంఘటన ప్రదేశానికి వచ్చి వివరాలు నమోదు చేసుకొని వెళ్లారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తనకు నష్టపరిహారం మంజూరు చేయాలని బాధిత రైతు కోరాడు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ల ప్రత్యేక పూజలు



చిన్నారి పాదాలకు పసుపు, కుంకుమ రాస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

గూడెంకొత్తవీధి: దసరా సందర్భంగా సీఆర్‌పీఎఫ్ జవాన్లు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సీఆర్‌పీఎఫ్ కమాండంట్ వీరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పూజలు నిర్వహించారు. చిన్నారి పాదాలకు పసుపు,కుంకుమ రాసి అలంకరించి పూజ చేశారు.

మార్గమధ్యలో మొరాయించిన ఆర్టీసీ బస్సులు

రాజవొమ్మంగి: ఏలేశ్వరం డిపో నుంచి నర్సీపట్నం వెళ్లాల్సిన రెండు ఆర్టీసీ బస్సులు మంగళవారం మార్గమధ్యలో ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. రాజవొమ్మంగి వచ్చేసరికి ఆగిపోయిన బస్సును ప్రయాణికులు, స్థానికులు తోసినా కదలలేదు. ఏలేశ్వరంలో మరో బస్సుకూడా ఇదే విధంగా ఆగిపోయిందని ప్రయాణికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భవానీ భక్తురాలు మృతి


గాయపడ్డ అప్పన్న


మరణించిన లక్ష్మి

నక్కపల్లి: జాతీయరహదారిపై ఉద్దండపురం జంక్షన్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భవానీ భక్తురాలు మృతిచెందింది. గ్రామానికి చెందిన పొడగట్ల లక్ష్మి(54) గ్రామంలో రోడ్డుపక్కన ఉన్న దుర్గాదేవిని దర్శించుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా తుని నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే దుర్మరణం పాలయింది. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నక్కపల్లి పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొట్టి ఒకరికి గాయాలు

గొడిచర్ల సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో వేంపాడుకు చెందిన పి.అప్పన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇతను మోటారు సైకిల్‌పై వేంపాడు వెళ్తుండగా వెనుకనుంచి లారీ ఢీకొట్టింది. ఘటనలో తీవ్రగాయాల పాలైన అతన్ని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పది అడుగుల కొండచిలువ హతం


రైతుల చేతుల్లో హతమైన కొండచిలువ

చోడవరం రూరల్: పంచాయతీ శివారు బంగారమ్మపాలెం గ్రామంలో రైతులకు చిక్కి భారీ కొండచిలువ హతమయ్యింది. మంగళవారం ఉదయం బంగారమ్మపాలెం గ్రామంలో పెద్దేరు సమీపంలో ఉన్న మండల నర్సింహమూర్తికి చెందిన చెరకు పొలాల్లో రైతులు చెరకుతోట చుట్టే పనులు చేసుకుంటున్నారు. ఆ సమయంలో చెరకు చెత్త కింద మందగమనంతో కదలిక రావడంతో అనుమానం వచ్చి చూడగా సుమారు 10 అడుగుల పొడవైన భారీ కొండచిలువ కన్పించింది. వెంటనే పక్కనున్న కళ్ళాలకు వెళ్లి దుడ్డుకర్రలను తీసుకువచ్చి ప్రాణరక్షణ నిమిత్తం కొండచిలువను హతం చేశారు.

క్లుప్తంగా

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

గూడెంకొత్తవీధి: పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అక్టోబర్ నుంచి నవంబర్ ఏడు వరకు నమోదుకు గడువు ఉందన్నారు. అర్హులైన అందరు పట్టభద్రులు వారి ఓటర్లగా నమోదు చేసుకోవాలన్నారు. ఫారం–18లో డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో కలిపి దరఖాస్తు చేయాలన్నారు. ఇందుకోసం తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు

క్రీడలతో మానసిక ఉల్లాసం



గుంటసీమలో వాలీబాల్ టోర్నీ పరిశీలిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

డుంబ్రిగుడ: గుంటసీమలో సర్పంచ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు మంగళవారం వాలీబాల్ టోర్నీ నిర్వహించార. ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రొత్సహించేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువత క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు.

శ్రమదానంతో రహదారి పనులు



రహదారి బాగు చేసుకుంటున్న గిరిజనులు

చింతపల్లి: బెన్నవరం పంచాయతీ పోతురాజు గున్నల నుంచి ప్రధాన రహదారి వరకు గిరిజన యువత శ్రమదానంతో రోడ్డు మరమ్మతు పనులు చేసుకున్నారు. సుమారు అర కిలో మీటరు మేర రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బురదమయంగా మారి, వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక యువకులు సుందరరావు, దన్ను, వసంత తదితరలు శ్రమదానంతో రోడ్డు బాగు చేసుకున్నారు.

వేగవంతంగా భూముల రీసర్వే పనులు



వయ్యేడులో రీసర్వే వివరాల నమోదును పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి

రాజవొమ్మంగి: వయ్యేడులో భూముల రీసర్వే పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామంలో తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి పర్యటించి, 34 మంది పట్టాదారులతో సమావేశమయ్యారు. జిరాయితీ భూముల్లో సాగు వివరాలపై ఆరా తీశారు. గ్రామంలో మృతి చెందిన వారి భూములను వారసులకు పంపిణీ (మ్యుటేషన్) ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. సర్వేయర్లు పార్థసారథి, అప్పన్నబాబు, వీఆర్వోలు దాక్షాయని, భారతి, వలంటీర్ సుబ్బలక్ష్మి తదితరులున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: పెదగెద్దాడ గ్రామానికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఎంపీపీ బందం శ్రీదేవి మంగళవారం పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లుదొర తదితరులున్నారు.

గ్రామసభలతోనే సమస్యల పరిష్కారం



సమస్యలపై చర్చిస్తున్న సభ్యులు

అరకులోయ రూరల్: సుంకరమెట్ట గ్రామ సచివాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ గ్రామసభలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. దండబాడు నుంచి కె.బెడ్డగుడ, లింబగుడ నుంచి బస్కి పంచాయతీ కొర్రాగుడ జంక్షన్ వరకు ఉపాధి పథకం ద్వారా రోడ్డు పనులకు తీర్మానించినట్టు చెప్పారు. గ్రామాల్లో అవసరమైన చోట్ల రోడ్డు, డ్రైనేజీల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నిధులు మంజూరైన వెంటనే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. వైస్ ఎంపీపీ సుమాంజలి, వైస్ సర్పంచ్ ఆశలత, సభ్యులు పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గడప గడపకు విశేష ఆదరణ

- గ్రామాల్లో పాడేరు, అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేల పర్యటన
- ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మికి ఘన స్వాగతం



వర్తనాపల్లిలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



జోగులపుట్టులో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పోతుకొండ గ్రామంలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పాడేరు రూరల్ : రాష్ట్రంలో ప్రస్తుతం పేదల సంక్షేమ ప్రభుత్వం నడుస్తోందని, సంక్షేమ, సంస్కరణలతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. లగిశపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కాడెలి, వర్తనాపల్లి గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 218 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలబడాలని కోరారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి, సర్పంచులు బసవన్నదొర, పార్వతమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ పాత్రుడు, వైస్ సర్పంచ్ బుల్లేశ్వరి, నాయకులు దశమూర్తి, భారతి, ప్రభావతి, సత్యనారాయణ, లక్ష్మికొండమ్మ, ఊర్వశిరాణి, సుశీల, భీమలింగం పాత్రుడు, సుదర్శన్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల కష్ట, సుఖాల్లో అండగా నిలుస్తా: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని ములియపుట్టు సచివాలయం పరిధిలోని పాటిమామిడి, బర్మన్‌గూడ, మెట్టమామిడి, కంగారుపుట్టు, కులుపాడు, ములియపుట్టు, బీరం తదితర గ్రామల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో సుమారు 403 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ఆత్మీయంగా పలకరించి, యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, సుపరిపాలన అందిస్తోందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గిరిజనులకు కష్ట సుఖాల్లో అండగా నిలుస్తానన్నారు. జోగులపుట్టులో అంగన్‌వాడీ భవానాన్ని ప్రారంభించారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, వైస్ ఎంపీపీ ప్రియాంక, ఎంఈవో రామచంద్రరావు, సీడీపీవో బాలచంద్రమణి దేవి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, సొసైటీ బ్యాంక్ చైర్మెన్ రామకృష్ణ, సర్పంచ్ చంటమ్మ, నాయకులు సూరయ్య, దివాకర్ బాబు, శామ్యూల్, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

దేవీపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి అన్నారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట పంచాయతీ పోతుకొండ గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శనీయమన్నారు. ఏజెన్సీలోని అటవీ హక్కుల చట్టం ద్వారా రాష్ట్ర చరిత్రనే లేని విధంగా గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన అందుతోందన్నారు. ఎంపీపీ కుంజం మురళి , జెడ్పిటీసీ శిరసం సత్యవేణి,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రధాన రహదారి వద్ద ఎండిన నిద్రగన్నేరు చెట్టు

అడ్డతీగల: మండల కేంద్రమైన అడ్డతీగలలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎండిన నిద్రగన్నేరు చెట్టు ప్రమాదాలకు నెలవుగా మారింది. దీంతో స్థానికులతో పాటు వాహనచోదకులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఎండిన ఈ చెట్టు కిందగా అడ్డతీగల సబ్‌స్టేషన్ నుంచి అడ్డతీగల మొత్తానికి విద్యుత్ సరఫరా కోసం వినియోగిస్తున్న 11 కెవి లైన్ విస్తరించి ఉంది. తరచూ ఎండిన చెట్టు కొమ్మలు ఆయా లైన్లపై పడి మంటలు చెలరేగి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోందంటున్నారు. ఎండిన కొమ్మలు పడి పలువురు గాయపడిన సంఘటలున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్టుని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కర్రలే విద్యుత్ స్తంభాలు



పుతికపుట్టు గ్రామంలోని కర్రలను విద్యుత్ స్తంభాలుగా ఏర్పాటు చేసుకున్న గిరిజనులు

అనంతగిరి: మండలంలోని కివర్ల పంచాయతీలు పుతికపుట్టు గ్రామంలోని విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉంటూ ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండడంతో స్థానిక గిరిజనులు కర్రలను విద్యుత్ స్తంభాలుగా ఏర్పాటు చేసుకున్నారు. వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కివర్ల పంచాయతీలోని పలు గ్రామాలకు ఇదే పరిస్థితి ఉందని, దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశామని సర్పంచ్ ముత్యాలమ్మ తెలిపారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సర్పంచ్, స్థానికులు కోరుతున్నారు.

తుప్పల తొలగింపు



జలపాతం వద్ద తుప్పలను తొలగిస్తున్న కమిటీ సభ్యులు

అనంతగిరి: స్థానిక సరియా జలపాతం వెళ్లే మార్గంలో తుప్పలు అధికంగా పెరగడంతో పర్యాటకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు సమస్య పరిష్కారానికి సరియా కమిటీ సభ్యులు ఆయా ప్రాంతంలో తుప్పల తొలగింపుతో పాటు జలపాతం వద్ద పారిశుధ్య పనులు మంగళవారం చేపట్టారు. కమిటీ సభ్యులు మహేష్ మాట్లాడుతూ పర్యాటకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

తుప్పలు తొలగించాలి

కొయ్యూరు: చింతాలమ్మ ఘాట్‌లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు తొలగించాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు కోరారు. తుప్పలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

అధికారుల గైర్హాజరుతో సమావేశం రద్దు

అడ్డతీగల: మండల సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరుతో సమావేశం రద్దు అయింది. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంపై గత నెల 16న అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీడీవో రత్నరాజ్ ఆహ్వానాలను పంపారు. అయితే సమావేశానికి ప్రభుత్వ శాఖల నుంచి ఒక్క మండల స్థాయి అధికారి హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో సమావేశానికి వచ్చిన వైస్ ఎంపీపీ బాలసుబ్రహ్మణ్యం, ఆరుగురు ఎంపీటీసీలు, 12 మంది సర్పంచ్‌లు మాట్లాడుతూ అధికారులు రాకుండా సమావేశం నిర్వహించడంతో ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఎంపీడీవో రత్నరాజుని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో మండల స్థాయి అధికారులను రప్పించి అప్పుడే సమావేశం నిర్వహించాలని వారు కోరడంతో, ఎంపీడీవో మంగళవారం నిర్వహించాల్సిన సమావేశాన్ని రద్దుచేసి మరోసారి నిర్వహిస్తామని ప్రకటించారు.

పార్టీ బలోపేతానికి కృషి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ, నేతలు

గూడెంకొత్తవీధి: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం కోసం కృషి చేస్తామని ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు తెలిపారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వంలో ఇస్తున్న వినతులను నేరుగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరిశీలించి, వాటి పరిష్కారంకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సారథ్యంలో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం కోసం పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని కోరారు. వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ప్రసాద్, సర్పంచ్ కృష్ణారావు, స్థానికులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రికి భవానీ మాలధారుల పయనం



ఇరుముడులతో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి పయనమతున్న భవానీ మాలధారులు

రాజవొమ్మంగి: మండలంలోని భవానీ మాలధరించిన భక్తులు మంగళవారం ఇరుముడులు కట్టుకొని ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు. విజయదశమి రోజున కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివెళ్లారు. రాజవొమ్మంగి శివాలయం కొండపై, జడ్డంగి శ్రీ దుర్గాదేవి ఆలయంలో గురుభవానీలు రామకృష్ణ, సూరిబాబులు మాలాధారులకు ఇరుముడులు కట్టి, తలపై పెట్టి యాత్రకు పంపారు. భక్తులతో పాటు పెద్ద ఎత్తున కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చికిలింతలో రేపు గడప గడపకు

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతున్నట్టు తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది పూర్తి సమాచారంతో రావాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

సెల్ సిగ్నల్ సమస్యతో సతమతం



సిగ్నల్ కోసం కొండపైకి చేరిన గ్రామస్తులు

అరకులోయ రూరల్: బస్కి పంచాయతీ పరిధిలో సెల్ సిగ్నల్ సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కేంద్రం నుంచి సెల్ సిగ్నల్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఈకేవైసీ, ప్రభుత్వ పథకాల ఆన్‌లైన్ ప్రక్రియ కోసం సుమారు 15 కిలోమీటర్ల దూరం వెళ్లి చేయించుకునే పరిస్థితి ఉంటుందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఘనంగా మహర్నవమి వేడుకలు

- మహిషాసుర మర్దనికి ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు



పాడేరులో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు



గంగవరంలో పెదఅడ్డపల్లి గ్రామంలో చిన్నారుల సందడి



అడ్డతీగలలో గిరిదుర్గా భవానీ ఆలయంలో మహిషాసుర మర్దని అలంకరణలో అమ్మవారు

పాడేరు రూరల్: గ్రామాలన్నీ విజయ దశమి వేడుకలకు ముస్తాబయ్యాయి. వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దసరా పండగను పురస్కరించుకొని బుధవారం తెల్లవారుజాము నుంచి కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఇళ్లను మామిడితోరణాలు, రంగుల రంగుల ముగ్గులతో అలంకరించారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయాల్లో మహర్నవమి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయాల్లో కనకదుర్గమ్మ మహిషాసుర మర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

శరన్నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని మెయిన్ బజారు వీధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు స్వయంగా వారే ప్రసాదాలను వడ్డించారు. ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, ఉత్సవ కమిటి ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జి.మాడుగుల: గెమ్మెలి పంచాయతీ జి.కొత్తూరు గ్రామంలో ఆంధ్ర వనవాసీ కళ్యాణాశ్రమం వ్యవస్థాపక ప్రముఖ్ ఎస్ వీఎస్ మూర్తి ఆధ్వర్యంలో దుర్గాష్టమి వేడుకలు జరిగాయి. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. హరిభజన, ధింసా సంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు అన్నసమారాధన జరిగింది.

పెదబయలు: మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవికి మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాద వితరణ చేపట్టారు.

దసరా సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆయుధ పూజ నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి ఊరేగింపు, అనుపు ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



జి.కొత్తూరులో పూజల్లో పాల్గొన్న భక్తులు



చింతపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

చింతపల్లి: మండల కేంద్రంలోని సోమలింగేశ్వర ఆలయంలో అమ్మవారికి విగ్రహానికి లక్ష గాజులతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుడు జగన్ ఆధ్వర్యంలో దశరా వేడుకలు నిర్వహిస్తున్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి, జడ్డంగి, దూసరపాము, లాగరాయి, అమీనాబాద్, కొండపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలు విజయదశమి వేడుకలకు సర్వం సిద్ధమయ్యాయి. పలు ఆలయాల వద్ద అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

గంగవరం : పెదఅడ్డపల్లి కనకదుర్గమ్మ ఆలయంలో మహానవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల అమ్మవారి వేషధారణ ఆకట్టుకుంది. స్థానిక రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు జరిగాయి.

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రంలోని శ్రీ గిరి దుర్గాభవానీ అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్దిని అవతారంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు వేకువజామునే అమ్మవారిని అలంకరించి పూజాధికాలు ప్రారంభించారు. అమ్మవారికి గారెలు, పరవాన్నం, పులిహోర నివేదించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. మండల కేంద్రంలోని దేవీ ఆలయంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు అడ్డతీగల సొసైటీ చైర్మన్ తోట రాజేశ్వరరావు తెలిపారు.

చిత్తడి దారులతో అవస్థలు



బురదమయమైన రాజుపాకలు ప్రధాన రహదారి

చింతపల్లిరూరల్: రాజుపాకలు ప్రధాన రహదారికి సమీపంలోని క్వారీ నుంచి మట్టి రోడ్డుపైకి వస్తుండడంతో వాహనచోదకులు బ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్డుపైకి కొట్టుకు వస్తున్న మట్టి ప్రమాదాలకు కారణమవుతుంది. గతంలో ఇక్కడ కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. ద్విచక్రవాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అనంతగిరి: పెదబిడ్డ పంచాయతీ చెరుకుమడత నుంచి పెదబిడ్డ పంచాయతీ కేంద్రం వరకు అధ్వానంగా ఉన్న రహదారి బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారి అస్తవ్యస్తంగా మారిందని, రహదారి నిర్మాణానికి కృషి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

అరకులోయ రూరల్: దాబుగుడ రహదారి మండలంలో మాదల పంచాయతీలో దాబుగుడ, దోమలజోరు, రత్తకండి, తుంగగడ్డ, కమలతోట గ్రామాల్లో అధ్వాన రహదారులతో అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. రహదారులు కోతకు గురై ప్రమాదకరంగా మారాయంటున్నారు. కొన్నిచోట్ల కల్వర్టులు పాడై ప్రమాదంగా దర్శనమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



'ఎఫ్ఐహెచ్ రైజింగ్ ప్లేయర్'గా ముంతాజ్ ఖాన్

భారత మహిళల హాకీ జట్టు ఫార్వర్డ్ ముంతాజ్ ఖాన్‌కు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) అవార్డు లభించింది. లక్నోకు చెందిన 19 ఏళ్ల ముంతాజ్ 'రైజింగ్ ప్లేయర్'గా ఎంపికైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో దక్షిణాఫ్రికాలో జరిగిన జూనియర్ ప్రపంచకప్‌లో ముంతాజ్ విశేషంగా రాణించి హ్యాట్రిక్‌తో సహా ఎనిమిది గోల్స్ సాధించింది. జూనియర్ ప్రపంచకప్‌లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత్ 'షూటౌట్'లో ఇంగ్లండ్ చేతిలో ఓడిపోయింది.

పోరాడి ఓడిన రామ్‌కుమార్



జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ రామ్‌కుమార్ రామనాథన్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో రామ్ 4-6, 6-3, 6-7 (1/7)తో రియో నొగుచి (జపాన్) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 5 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్ తొమ్మిది ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. రామ్‌కుమార్‌కు 15,235 డాలర్ల (రూ.12 లక్షల 40 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



ఇరానీ కప్ చాంపియన్ రెస్ట్ ఆఫ్ ఇండియా

రాజ్‌కోట్: ఇరానీ కప్ మళ్లీ రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టునే వరించింది. రంజీ మాజీ చాంపియన్ సౌరాష్ట్రతో జరిగిన పోరులో రెస్ట్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. మంగళవారం 368/8 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర కేవలం మరో 12 పరుగులే జత చేసి మిగిలున్న రెండు వికెట్లను కోల్పోయింది. 380 పరుగుల వద్ద ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 276 పరుగుల ఆధిక్యం పొందిన రెస్ట్ ఆఫ్ ఇండియా ముందు 105 పరుగుల లక్ష్యమే ఉండగా... దీన్ని 31.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ ప్రియాంక్ (2), యశ్ ధుల్ (8) విఫలమవగా, అభిమన్యు ఈశ్వరన్ (63 నాటౌట్; 9 ఫోర్లు), శ్రీకర్ భరత్ (27 నాటౌట్; 5 ఫోర్లు) మరో వికెట్ పడకుండా మ్యాచ్ ముగించారు. ఇద్దరు అభేద్యమైన మూడో వికెట్‌కు 81 పరుగులు జోడించారు. దీంతో రెస్ట్ ఆఫ్ ఇండియా ఖాతాలో 29వసారి ఇరానీ కప్ చేరింది.

హెట్‌మైర్‌పై వేటు



సెయింట్ జాన్స్ (అంటిగ్వా): వెస్టిండీస్ 'హార్డ్ హిట్టర్' హెట్‌మైర్‌పై ఆ దేశ బోర్డు వేటు వేసింది. ప్రపంచకప్‌లో ఆడే కరీబియన్ జట్టు నుంచి తప్పించింది. అతని స్థానంలో షమరా బ్రూక్స్‌ను ఎంపిక చేసింది. బోర్డు సూచనల్ని బేఖాతరు చేయడంతో అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆసీస్‌లో మెగా టోర్నీకి ముందు వారితో ద్వైపాక్షిక సిరీస్ కోసం గత శనివారమే జట్టుతో పాటు బయలుదేరాల్సి ఉంది. అయితే కుటుంబ కారణాలరీత్యా ఆ రోజు విమానం ఎక్కలేనని హెట్‌మైర్ సమాచారమిచ్చాడు. తొలిసారి సమ్మతించిన వెస్టిండీస్ బోర్డు మళ్లీ సోమవారం కూడా బయలుదేరేందుకు సిద్ధంకాకపోవడంతో ప్రపంచకప్ జట్టు నుంచి తొలగించింది. రీ షెడ్యూల్ ఫ్లయిట్‌కు అందుబాటులో ఉండనని తీరిగ్గా చెప్పడంతో బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసి అతడిని జట్టు నుంచి తొలగించాలని నిర్ణయం తీసుకుంది.

చివరిది వదిలేశారు

- మూడో టి20లో భారత్ పరాజయం
- 49 పరుగులతో నెగ్గిన దక్షిణాఫ్రికా
- రిలీ రోసో సెంచరీ



ఇండోర్: టీమిండియా టి20 ప్రపంచకప్ సన్నాహకం పరాజయంతో ముగిసింది. మెగా టోర్నీకి ముందు ఆడిన చివరి పోరులో భారత్ ఓటమి పాలైంది. ఇప్పటికే సిరీస్ చేజార్చుకున్న దక్షిణాఫ్రికా మూడో టి20లో స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చి 49 పరుగులతో భారత్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. రిలీ రోసో (48 బంతుల్లో 100 నాటౌట్; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ టి20ల్లో తొలి సెంచరీ సాధించగా... డికాక్ (43 బంతుల్లో 68; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీ చేశాడు. అనంతరం భారత్ 18.3 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. దినేశ్ కార్తీక్ (21 బంతుల్లో 46; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), దీపక్ చహర్ (17 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. భారత్ ఈ సిరీస్‌ను 2–1తో సొంతం చేసుకుంది.

భారీ భాగస్వామ్యాలు...

కెప్టెన్ బవుమా (3) పేలవ ఫామ్ కొనసాగగా, మరో ఓపెనర్ డికాక్ మొదటి నుంచే ధాటిగా ఆడాడు. మూడో స్థానంలో వచ్చి రోసో కూడా దూకుడు కనబర్చడంతో దక్షిణాఫ్రికా వేగంగా పరుగులు రాబట్టింది. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 48 పరుగులకు చేరింది. అశ్విన్ బౌలింగ్‌లో రోసో (వ్యక్తిగత స్కోరు 24) ఇచ్చిన క్యాచ్‌ను బౌండరీపై సిరాజ్ అందుకోలేకపోగా, అది సిక్స్‌గా మారింది. మరోవైపు ఉమేశ్ బౌలింగ్‌లో సిక్స్‌తో 33 బంతుల్లో డికాక్ అర్ధసెంచరీ పూర్తయింది. రెండో వికెట్‌కు 47 బంతుల్లో 89 పరుగులు జోడించిన తర్వాత డికాక్ రనౌట్‌గా వెనుదిరిగాడు. అనంతరం రోసో 27 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. చహర్, హర్షల్ ఓవర్లలో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టిన 90ల్లోకి చేరిన రోసో... చివరి ఓవర్ రెండో బంతికి సింగిల్ తీసి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. చహర్ వేసిన ఆఖరి ఓవర్లో వరుసగా మూడు సిక్స్‌లు బాది డేవిడ్ మిల్లర్ (5 బంతుల్లో 19 నాటౌట్; 3 సిక్స్‌లు) ఇన్నింగ్స్‌కు ఘనమైన ముగింపునిచ్చాడు.



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రిలీ రోసో

పోరాడకుండానే...

8 ఓవర్లు ముగిసేసరికి ఐదుగురు బ్యాటర్లు పెవిలియన్‌కు... క్రీజ్‌లో ఇద్దరు బౌలర్లు అక్షర్, హర్షల్! ఛేదనలో భారత జట్టు పరిస్థితి ఇది. ఓపెనర్‌గా వచ్చిన 'బర్త్‌డే బాయ్' పంత్ (14 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కార్తీక్ క్రీజ్‌లో ఉన్న కొద్దిసేపు (20 బంతుల్లో 41 పరుగుల భాగస్వామ్యం) టీమిండియాకూ విజయవకాశాలు ఉన్నాయని అనిపించింది. గత మ్యాచ్‌లో భారీ లక్ష్యమే అయినా దక్షిణాఫ్రికా పోరాడిన తరహాలో భారత్ కూడా చెలరేగవచ్చని భావించినా అది సాధ్యం కాలేదు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (రనౌట్) 68; బవుమా (సి) రోహిత్ (బి) ఉమేశ్ 3; రోసో (నాటౌట్) 100; స్టబ్స్ (సి) అశ్విన్ (బి) చహర్ 23; మిల్లర్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 227. వికెట్ల పతనం:** 1–30, 2–120, 3–207. **బౌలింగ్:** చహర్ 4–0–48–1, సిరాజ్ 4–0–44–0, అశ్విన్ 4–0–35–0, ఉమేశ్ 3–0–34–1, హర్షల్ 4–0–49–0, అక్షర్ 1–0–13–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) రబడ 0; పంత్ (సి) స్టబ్స్ (బి) ఇన్‌గిడి 27; శ్రేయస్ (ఎల్బీ) (బి) పార్నెల్ 1; కార్తీక్ (బి) మహరాజ్ 46; సూర్యకుమార్ (సి) స్టబ్స్ (బి) ప్రిటోరియస్ 8; అక్షర్ (సి) డి కాక్ (బి) పార్నెల్ 9; హర్షల్ (సి) మిల్లర్ (బి) ఇన్‌గిడి 17, అశ్విన్ (సి) రబడ (బి) మహరాజ్ 2, చహర్ (సి) మిల్లర్ (బి) ప్రిటోరియస్ 31; ఉమేశ్ (నాటౌట్) 20; సిరాజ్ (సి) మిల్లర్ (బి) ప్రిటోరియస్ 5; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (18.3 ఓవర్లలో ఆలౌట్) 178. వికెట్ల పతనం:** 1–0, 2–4, 3–45, 4–78, 5–86, 6–108, 7–114, 8–120, 9–168, 10–178. **బౌలింగ్:** రబడ 4–0–24–1, పార్నెల్ 4–0–41–2, ఇన్‌గిడి 3–0–51–2, మహరాజ్ 4–0–34–2, ప్రిటోరియస్ 3.3–0–26–3.

జ్యోతి ఖాతాలో రెండో స్వర్ణం

అహ్మదాబాద్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యెర్రాజీ మళ్లీ మెరిసింది. ఇప్పటికే మహిళల 100 మీటర్ల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ఈ వైజాగ్ అథ్లెట్ 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లోనూ బంగారు పతకం సొంతం చేసుకుంది. మంగళవారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును జ్యోతి 12.79 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచింది. తెలంగాణకు చెందిన అగసార నందిని 13.38 సెకన్లలో గమ్యానికి చేరి రజత పతకం సాధించింది. మహిళల జావెలిన్ త్రోలో రష్మీ శెట్టి ఆంధ్రప్రదేశ్‌కు రజత పతకం అందించింది. రష్మీ జావెలిన్‌ను 53.95 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచింది. టెన్నిస్ పురుషుల డబుల్స్ విభాగంలో కొనసరాజు శివదీప్–ముని అనంత్‌మణి (ఆంధ్రప్రదేశ్) జోడీ కాంస్య పతకం సాధించింది. సెమీఫైనల్లో శివదీప్–అనంత్‌మణి ద్వయం 7–5, 3–6, 6–10తో ప్రజ్వల్ దేవ్–ఆదిల్ (కర్ణాటక) జోడీ చేతిలో ఓడి కాంస్యం సొంతం చేసుకుంది.



జ్యోతి యెర్రాజీ

భారత అమ్మాయిల 'హ్యాట్రిక్'

- యూఏఈపై 104 పరుగులతో విజయం
- రాణించిన జెమీమా, దీప్తి శర్మ



జెమీమా

సిల్హెట్ (బంగ్లాదేశ్): మహిళల ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయం సాధించింది. మంగళవారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెమీమా రోడ్రిగ్స్ (45 బంతుల్లో 75 నాటౌట్; 11 ఫోర్లు), దీప్తి శర్మ (49 బంతుల్లో 64; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. దీంతో భారత అమ్మాయిల జట్టు 104 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఈ టోర్నీలో మహిళల జట్టుకిది వరుసగా మూడో విజయం. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన భారత అమ్మాయిల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. ఓపెనర్లు సబ్బినేని మేఘన (10), రిచా ఘోష్ (0), దయాళన్ హేమలత (2) నిరాశపరచడంతో భారత్ 20 పరుగులకే 3 కీలక వికెట్లను కోల్పోయింది. ఈ దశలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన దీప్తి, ఐదో వరుస బ్యాటర్ జెమీమా ధాటిగా ఆడారు. ఇద్దరు నాలుగో వికెట్‌కు 128 పరుగులు జోడించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసింది. తదుపరి మ్యాచ్‌లో భారత అమ్మాయిల జట్టు 7న పాకిస్తాన్‌తో తలపడుతుంది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్



చెంగ్డూ (చైనా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన గ్రూప్–2 చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 0–3తో ఫ్రాన్స్ చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో మానవ్ ఠక్కర్ 6–11, 8–11, 8–11తో అలెక్సిస్ చేతిలో... రెండో మ్యాచ్‌లో సత్యన్ 4–11, 2–11, 6–11తో ఫెలిక్స్ లెబ్రున్ చేతిలో... మూడో మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 13–11, 11–13, 11–7, 8–11, 7–11తో జులెస్ రొలాండ్ చేతిలో ఓడిపోయారు. లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాక జర్మనీ, ఫ్రాన్స్, భారత్ ఏడు పాయింట్లతో సమఉజ్జీగా నిలిచాయి. టోర్నీ నిబంధనల ప్రకారం మొత్తం ఏడు గ్రూప్‌ల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంటాయి. ఆ తర్వాత మూడో స్థానంలో నిలిచిన రెండు అత్యుత్తమ జట్లకు మిగతా రెండు బెర్త్‌లు లభిస్తాయి. ముఖాముఖి ఫలితాల ఆధారంగా గ్రూప్–2 నుంచి జర్మనీ, ఫ్రాన్స్ నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత పొందాయి. మూడో స్థానంలో నిలిచిన రెండు అత్యుత్తమ జట్లలో ఒకటిగా భారత్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో చైనాతో భారత పురుషుల జట్టు... చైనీస్ తైపీతో భారత మహిళల జట్టు తలపడతాయి.

ప్రపంచ వరల్డ్ 6-రెడ్ స్నూకర్ చాంప్ శ్రీకృష్ణ



కౌలాలంపూర్: ప్రపంచ 6–రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్ శ్రీకృష్ణ సూర్యనారాయణన్ విజేతగా అవతరించాడు. మంగళవారం జరిగిన ఫైనల్లో తమిళనాడుకు చెందిన శ్రీకృష్ణ 5–1 ఫ్రేమ్‌ల (51–4, 0–39, 63–0, 39–0, 45–7, 43–2) తేడాతో హబీబ్ సబా (బహ్రెయిన్)పై గెలిచాడు. సెమీఫైనల్లో శ్రీకృష్ణ 5–4 ఫ్రేమ్‌ల తేడాతో జేమ్స్ వతానా (థాయ్‌లాండ్)పై నెగ్గాడు. 22 ఏళ్ల శ్రీకృష్ణ జాతీయ 6–రెడ్ స్నూకర్ చాంపియన్ కాగా, 2019లో జాతీయ బిలియర్డ్స్ చాంపియన్‌గా నిలిచాడు.

సినిమా

ప్రతి సినిమా ఓ చాలెంజ్ - నాగార్జున



"నేను సినిమాల్లోకి వచ్చి 36 ఏళ్లవుతున్నా ఇప్పటికీ కొంచెం నెర్వస్‌గా ఫీలవుతుంటాను. ప్రతి సినిమాని సవాల్‌గా భావిస్తాను. ఒక సినిమాకి ఏడాదికి పైగా పని చేస్తాం కాబట్టి మంచి కథ ఎంచుకున్నానా? లేదా అని ఆలోచిస్తాను. షూటింగ్‌లో ప్రతి రోజూ చాలెంజ్‌గానే ఉంటుంది" అని అక్కినేని నాగార్జున అన్నారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో నాగార్జున, సోనాల్ చౌహాన్ జంటగా నటించిన చిత్రం 'ది ఘోస్ట్'. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు, శరత్ మరార్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగార్జున చెప్పిన విశేషాలు..

- 'గరుడవేగ' సినిమా చూసి, ప్రవీణ్ సత్తారుని పిలిచి, ఓ మంచి సినిమా చేద్దామన్నాను. యాక్షన్ ఎంటర్‌టైనర్ చేద్దామని తను చెప్పాడు. అందరూ అదే జానర్‌లో చేస్తున్నారు.. మనం స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చేద్దాం అన్నాను. మూడు నాలుగు నెలలు సమయం తీసుకుని 'ది ఘోస్ట్' కథ రాసుకొచ్చాడు ప్రవీణ్. కథ వినగానే అద్భుతంగా అనిపించడంతో ఓకే చెప్పాను.
- 'ది ఘోస్ట్' పెద్ద కథ, అద్భుతాలు సృష్టిస్తుందని చెప్పను.. కానీ చాలా మంచి కుటుంబ కథ. 'శివ' సినిమాలో ఫ్యామిలీ డ్రామా బాగా వర్కవుట్ అయింది. 'ది ఘోస్ట్'లోనూ అలాగే ఉంటుంది. ఆపదలో ఉన్న సోదరిని కాపాడే పాత్ర చాలా భావోద్వేగంగా ఉంటుంది. ఇది యాక్షన్ ఫిల్మ్ అయినా ఎమోషన్ బాగా సెట్ అయింది. ఈ కథని ప్రవీణ్ చాలా కొత్తగా తీశాడు. ఫైనల్ కాపీ చూశాక నేనే షాక్ అయ్యాను. తన స్టోరీ ప్రజెంటేషన్‌కి ఇంప్రెస్ అయ్యాను.
- 'ది ఘోస్ట్' చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా విజయంపై ఎంతో నమ్మకం ఉంది.. అందుకే ఎక్కువగా ప్రమోషన్స్ చేస్తున్నాం. ఏ సినిమాకు అయినా ప్రమోషన్స్ చాలా ముఖ్యం. రిలీజ్‌కి ముందు మనం ఒక హైప్ క్రియేట్ చేయాలి. సినిమా రిలీజ్ తర్వాత ప్రమోషన్స్ మన చేతుల్లో ఉండదు.. మూవీ బాగుంటే మౌత్ టాక్‌తో అందరికీ దగ్గరవుతుంది.
- పండగ సమయాల్లో రెండు పెద్ద సినిమాలు విడుదల అయినా ప్రేక్షకులు చూస్తారు. చిరంజీవిగారి 'గాడ్ ఫాదర్', నా 'ది ఘోస్ట్' చిత్రాలు ఒకేరోజు రిలీజ్ అవడం హ్యాపీ. మా ఇద్దరి సినిమాలు గతంలో రెండు మూడు రోజుల తేడాతో విడుదలయ్యాయి.. కానీ, ఇన్నేళ్లలో ఒకే రోజు విడుదల కావడం ఇదే మొదటిసారి. అయినా ఎలాంటి పోటీ లేదు.. రెండూ బాగా ఆడాలి.
- 'ది ఘోస్ట్'లో నేను, సోనాల్ చౌహాన్ ఇంటర్‌పోల్ ఆఫీసర్స్‌గా చేశాం. నాతో పాటు సోనాల్ యాక్షన్ సీక్వెన్స్ చేసింది.. ఇందుకోసం రెండు మూడు వారాలు శిక్షణ తీసుకుని అద్భుతంగా చేసింది. 'శివ' సినిమా రిలీజ్ తర్వాత సౌండ్ డిజైనింగ్ బాగుందని అందరూ అన్నారు. 'ది ఘోస్ట్' ప్రీమియర్ చూసినవారు సినిమా చాలా బాగుందని, ప్రత్యేకించి సౌండ్ డిజైనింగ్ అద్భుతంగా ఉందని చెప్పడంతో సినిమా విజయంపై మా నమ్మకం మరింత పెరిగింది.
- నా 'శివ' చిత్రాన్ని 4కేలోకి మార్చి రీ రిలీజ్ చేయాలనుకుంటున్నాం.. అందుకు సమయం పడుతుంది. ఇటీవల సినిమాకి బౌండరీలు లేకపోవడం శుభపరిణామం. 'ఆర్ఆర్ఆర్' చిత్రాన్ని జపాన్‌లో దాదాపు వెయ్యిమంది పట్టే ఓ థియేటర్‌లో నిల్చొని చూడటం గొప్ప విషయం. 'ఆర్ఆర్ఆర్, బ్రహ్మాస్త్ర, కార్తికేయ 2' చిత్రాల్లో గ్రాఫిక్స్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. అయితే గ్రాఫిక్స్ కూడా ప్రేక్షకులు ఒరిజినల్‌లా భావించేలా ఉండాలి.. అంతేకానీ గ్రాఫిక్స్ అనుకునేలా ఉండకూడదు.
- నాగచైతన్యతో కలిసి 'మనం, బంగార్రాజు' సినిమాలు చేశాను. అఖిల్‌తో ఓ సినిమా చేద్దామనుకున్నాను. తనకి యాక్షన్ అంటే ఇష్టం.. అందుకే యాక్షన్ డ్రామా నేపథ్యంలో మా కాంబినేషన్ ఉంటుంది. 'ఒకే ఒక జీవితం' చిత్రంలో అమల చేసిన తల్లి పాత్ర అద్భుతంగా ఉంది.. అందరూ బాగా కనెక్ట్ అయ్యారు. 'బ్రహ్మాస్త్రం'లో నా పాత్ర నిడివి తక్కువ అయినా మంచి పేరొచ్చింది. 'బ్రహ్మాస్త్రం 2'లో నేను ఉంటానో? లేదో తెలియదు. వరుసగా సినిమాలు చేస్తున్నాను.. కొద్ది రోజులు గ్యాప్ తీసుకుని తర్వాతి సినిమా మొదలు పెడతాను. రెండు మూడు కథలు చర్చల్లో ఉన్నాయి.

నా ఇమేజ్ నాది కాదు - చిరంజీవి



''స్టార్ ఇమేజ్ ఉన్నప్పటికీ నేను నిరాడంబరంగా ఉంటానని ఇండస్ట్రీ వాసులు అంటున్నారు. కానీ ఓ శిల్పం బాగుందంటే అది ఆ శిల్పం గొప్పదనం కాదు.. ఆ శిల్పం చెక్కినవారిది.. మోసినవారిది.. గుర్తించినవారిది. అలాగే నా ఇమేజ్ కూడా నాది కాదు. నాకు అవకాశాలు కల్పించిన దర్శక–నిర్మాతలు, సహకరించిన నటీనటులు, ఆదరించిన ప్రేక్షకులు, అభిమానులది. నా ఇమేజ్ నాది అనుకుంటే అది నా అమాయకత్వం, మూర్ఖత్వమే అవుతుంది'' అని చిరంజీవి అన్నారు. చిరంజీవి హీరోగా మోహన్‌రాజా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గాడ్ ఫాదర్'. మలయాళ 'లూసీఫర్'కు తెలుగు రీమేక్‌గా 'గాడ్ ఫాదర్' రూపొందింది. కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్.బి. చౌదరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది.

ఈ సందర్భంగా మంగళవారం జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో చిరంజీవి మాట్లాడుతూ – ''రొటీన్‌గా పాటలు, హీరోయిన్, ఫైట్స్... ఇవి లేకుండా వైవిధ్యమైన సినిమాలు చేయాలని ఆలోచిస్తున్నప్పుడు రామ్‌చరణ్ 'లూసీఫర్' గురించి చెప్పాడు. తెలుగు డబ్బింగ్ వెర్షన్ 'లూసీఫర్' చూశాను. ఎక్కడో వెలితి.. అసంతృప్తి. సత్యానంద్‌గారు, మోహన్‌రాజా చెప్పిన మార్పులతో ఈ కథను తెలుగు ప్రేక్షకులకు చెప్పాలనుకున్నాం. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఫైట్స్, హీరోయిన్, పాటలు అనే ఆలోచనలు రాకుండా కథ, అందులోని నా క్యారెక్టర్‌తోనే ప్రేక్షకులు ట్రావెల్ అవుతారు. ఫైట్స్, రొమాన్స్, యాక్షన్ వంటి అంశాలను కట్ చేసినా కథలోని సోల్‌కు కనెక్ట్ అయితే ఆ సినిమా భవిష్యత్ దాదాపు తెలిసిపోతుంది.

'గాడ్‌ఫాదర్' చిత్రం విజయం సాధిస్తుంది. మోహన్‌రాజా బాగా తెరకెక్కించాడు. సల్మాన్ ఖాన్, నయనతార, సత్యదేవ్, పూరి జగన్నాథ్ బాగా నటించారు. తమన్ మ్యూజిక్ అదిరిపోతుంది. ఆర్బీ చౌదరిగారు లెజెండరీ ప్రొడ్యూసర్. ఆయన నిర్మాణసంస్థ వంద సినిమాల మైలురాయికి దగ్గరపడుతోంది. వందో సినిమాలో నన్ను చేయమన్నట్లుగా అడిగారు. మంచి కథ కుదిరితే చేస్తాను. నిర్మాత ఎన్వీ ప్రసాద్‌గారు మా ఫ్యామిలీ మెంబర్. 'గాడ్ ఫాదర్'పై ప్రేక్షకుల అభిమానం, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు.

'గాడ్ ఫాదర్' కంప్లీట్ పొలిటికల్ అండ్ ఫ్యామిలీ ఫిల్మ్. ఈ సినిమాలోని డైలాగ్స్ సమకాలీన రాజకీయాలను ఉద్దేశిస్తూ కానీ, విమర్శిస్తూ కానీ చెప్పినవి కావు. మాతృక (మలయాళ 'లూసీఫర్')లో ఉన్న కథ ఆధారంగానే 'గాడ్ ఫాదర్'లో డైలాగ్స్ ఉన్నాయి. ఆ డైలాగ్‌లు విని ఎవరైనా భుజాలు తడుముకుంటే నేనేం చేయలేను.

రీమేక్ అనగానే ఎందుకు తక్కువ భావనతో చూస్తారో నాకు అర్థం కావడం లేదు. రీమేక్ అనేది ఓ చాలెంజ్. నేను చేసిన రీమేక్ మూవీస్ కూడా మాతృకల కంటే ఎక్కువ కలెక్షన్స్ సాధించాయి. యాక్టర్‌గా నాకు పేరు తీసుకువచ్చాయి. పోలికలు పెట్టినా సరే నేను నిలబడగలను అని నా హిస్టరీ చెబుతుంది. ఆ ఆత్మవిశ్వాసం నాలో ఉంది.

రాజకీయాల నుంచి తిరిగి ఇండస్ట్రీకి వస్తున్నప్పుడు గతంలో అభిమానులు, ప్రేక్షకులు నాపై చూపించిన ప్రేమ అలానే ఉంటుందా? అనే సందేహం నాకు కలిగింది. కానీ నా 'ఖైదీ నంబరు 150' సినిమా ఫంక్షన్‌కు భారీగా వచ్చిన అభిమానులు, ప్రేక్షకులను చూసి ఆ అనుమానం తీరిపోయింది. వారి ప్రేమకు ధన్యవాదాలు.

దర్శకుడు మోహన్‌రాజా మాట్లాడుతూ – ''ఈ రోజు మనం పాన్ ఇండియా సినిమాల గురించి మాట్లాడుకుంటున్నాం. కానీ ఆంధ్ర సినిమా మ్యాప్ దేశానికి చూపించిన వ్యక్తి చిరంజీవి. 1992–2000 సమయాల్లో ఎక్కువ పారితోషికం తీసుకుంది, మార్కెట్ క్రియేట్ చేసింది చిరంజీవిగారే'' అన్నారు. ''చిరంజీవిగారితో సినిమా చేయాలన్న నా ఆకాంక్ష 'గాడ్ ఫాదర్'తో నెరవేరింది. ఇందుకు కారణమైన రామ్‌చరణ్‌కు ధన్యవాదాలు'' అన్నారు ఎన్వీ ప్రసాద్. ''చిరంజీవిగారు–చరణ్‌ల వల్లే సల్మాన్ ఖాన్ ఈ సినిమాలో నటించారు. 'గాడ్ ఫాదర్' చిత్రం విజయం సాధిస్తుంది'' అన్నారు నిర్మాత ఆర్బీ చౌదరి. రచయిత సత్యానంద్, మాటల రచయిత లక్ష్మీభూపాల్, గేయ రచయితలు రామజోగయ్య శాస్త్రి, అనంత శ్రీరామ్, నటుడు బ్రహ్మాజీ, 'గెటప్' శీను, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్వీ ప్రసాద్, సత్యదేవ్, మోహన్ రాజా, చిరంజీవి, సత్యానంద్, ఆర్బీ చౌదరి

ఆ స్టార్స్ పక్కన నా పోస్టర్ ఉండటం హ్యాపీ

''సినిమా అంటే కేవలం ఫైట్స్, యాక్షనే అని నేను అనుకోవడం లేదు. కథలో పర్టిక్యులర్‌గా ఫలానా అంశాలు, లక్షణాలు ఉండాలని కోరుకోను. సినిమా బాగుంటే ఏ రకం జానర్ అయినా ప్రేక్షకులు థియేటర్స్‌కు వచ్చి చూస్తారు'' అని బెల్లంకొండ గణేష్ అన్నారు. బెల్లకొండ గణేష్ హీరోగా లక్ష్మణ్ కె. కృష్ణ దర్శకుడిగా పరిచయం అవుతున్న సినిమా 'స్వాతిముత్యం'. ఇందులో వర్ష బొల్లమ్మ హీరోయిన్. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో బెల్లంకొండ గణేష్ చెప్పిన విశేషాలు...

- చిన్నతనం నుంచే నాకు యాక్టర్ కావాలన్న ఆలోచన ఉన్నప్పటికీ 2016 నుంచే సీరియస్‌గా తీసుకున్నాను. 2017లో ముంబైలో, 2018లో యూఎస్‌లో యాక్టింగ్ కోర్సులు చేశాను. 2019 నుంచి కథలు వినడం మొదలుపెట్టాను. అలా 2020లో 'స్వాతిముత్యం' కథ విన్నాను. ఈ కథతో ప్రేక్షకుల ముందుకు వస్తే ఓ నటుడిగా నన్ను ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మి నిర్మాత నాగవంశీగారి దగ్గరకు వచ్చాను. ఆయనకూ ఈ కథ నచ్చింది.
- స్పెర్మ్ డొనేషన్ ఆధారంగా హిందీలో 'విక్కీ డోనర్' వచ్చింది. కానీ మా 'స్వాతిముత్యం' ఈ ఒక్క పాయింట్ ఆధారంగానే సాగదు. మరికొన్ని కొత్త అంశాలు ఉన్నాయి. వీటికి ఆడియన్స్ కనెక్ట్ అవుతారు.
- మా నాన్నగారు (నిర్మాత బెల్లంకొండ సురేష్) 'స్వాతిముత్యం' కథ విన్నారు. అయితే కథల ఎంపికలో నాదే తుది నిర్ణయం. ఈ సినిమాను మా బ్యానర్‌లోనే చేసి ఉండొచ్చు. అయితే మరో ప్రముఖ బ్యానర్‌లో చేయడం, లాంచ్ కావడం అనేది నాకు మరింత గౌరవాన్ని తీసుకువస్తుంది. మా నాన్న నిర్మాత కావడంతో నా చిన్నతనం నుంచే సెట్ వాతావరణం నాకు అలవాటు ఉంది. అయితే అప్పుడు కెమెరా వెనుక... ఇప్పుడు యాక్టర్‌గా కెమెరా ముందు.
- నా తొలి పది సినిమాలను పది రకాల జానర్స్‌లో చేయాలనుకుంటున్నాను. నా నెక్ట్స్ మూవీ 'నేను.. స్టూడెంట్' ఓ థ్రిల్లర్ సబ్జెక్ట్. ఇక నేను హీరోగా పవన్ సాదినేని దర్శకత్వంలో మొదలైన సినిమా షూటింగ్ యూఎస్‌లో చేయాలి. కోవిడ్ వల్ల అప్పట్లో కుదర్లేదు. ఇప్పుడు దర్శక–నిర్మాతలు ఓకే అంటే నేను రెడీ. ఎందుకంటే ఈ సినిమా సబ్జెక్ట్ కూడా బాగుంటుంది.

చిరంజీవిగారి 'గాడ్‌ఫాదర్', నాగార్జునగారి 'ది ఘోస్ట్' సినిమాలు విడుదలవుతున్న రోజునే నేను హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'స్వాతి ముత్యం' కూడా రిలీజ్ అవుతుండటం కాస్త టెన్షన్‌గానే ఉంది. మల్టీప్లెక్స్‌లలో ఆ స్టార్ హీరోల సినిమా పోస్టర్స్‌తో పాటు నా సినిమాల పోస్టర్స్ కూడా కనిపిస్తుండటం కొంచెం హ్యాపీగా ఉంది. యాక్టర్‌గా నాకు వెంకటేశ్‌గారు స్ఫూర్తి. దర్శకులు రాజమౌళిగారి సినిమాలో నటించాలనేది నా డ్రీమ్.



జెట్టీతో నా కల నెరవేరింది

''గ్రామీణ నేపథ్యంలోని సినిమాలో పల్లెటూరి అమ్మాయిగా నటించాలనేది నా కల. అది 'జెట్టీ'తో నెరవేరింది. ఈ చిత్రం మంచి హిట్టవుతుంది'' అన్నారు హీరోయిన్ నందితా శ్వేత. సుబ్రమణ్యం పిచ్చుక దర్శకత్వంలో నందితా శ్వేత, మన్యం కృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జెట్టి'. వేణు మాధవ్ కె. నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''మత్స్యకారుల జీవితాల్లోని సమస్యలను చెప్పే చిత్రమిది. పోర్టుల పేరుతో మత్స్యకారుల జీవితాలను ఎలా ఇబ్బందులు పెడుతున్నారు? అనేది ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు. 'జెట్టి' అంటే పోర్టు అని అర్థం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా రిలీజవుతుంది'' అన్నారు వేణు మాధవ్ .కె. మన్యం కృష్ణ, సంగీతదర్శకుడు కె. కార్తీక్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వీరమణి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పంద్రాజు శంకర్రావు.



నందితా శ్వేత